క్లుప్తంగా

నర్సింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులో నిబంధనలు అతిక్రమించిన ప్రైవేటు నర్సింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్యకు ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అండ్ నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయుడు సోమవారం వినతి పత్రం సమర్పించారు. జిల్లాలోని నర్సింగ్ కాలేజీలు నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఫీజులు, క్లినికల్ ఫీజుల విషయంలో కళాశాలల యాజమాన్యాలు పాల్పడుతున్న ఆర్థిక దోపిడీ విషయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విచారణ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు 'అజీజ్ కథలు' సంపుటి ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ కవి ఎస్‌డీవీ అజీజ్ రచించిన 'అజీజ్ కథలు' సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 18వ తేదీ సాయంత్రం 3 గంటలకు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఫర్‌మెన్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ వింధ్యావాసినీ దేవి పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు. సిల్వర్ జూబ్లీ కళాశాల, కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఫమిదా బేగం, డాక్టర్ డి.పార్వతీ దేవి హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ



కుట్టు మిషన్లతో మహిళలు

కర్నూలు కల్చరల్: మహిళలకు ఉపాధి కల్పించేందుకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధరవార పేటలో ఏర్పాటు చేసినట్లు వీహెచ్‌పీ సహాయ కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. సోమవారం శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఈయన మాట్లాడుతూ.. బస్తీలో మహిళలకు 18 నెలల నుంచి ఉచిత శిక్షణ ఇచ్చి 15 మందికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన వారికి వీహెచ్‌పీ,బాల సాయిబాబా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు అందించినట్లు చెప్పారు.

హ్యాండ్‌బాల్ విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు(టౌన్): అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టును సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ రుద్రరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవడం హర్షించదగ్గ విషయమన్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలన్నారు.

నేడు పవర్ లిఫ్టింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో మంగళవారం పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

బలమైన పునాదులుంటేనే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్

కర్నూలు సిటీ: ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు భాష, గణితంలో పునాది బలంగా ఉంటేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ అన్నారు. సోమవారం నగర శివారులోని శ్రీలక్ష్మీ శ్రీనివాస కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఆరు రోజుల పాటు జరుగుతున్న ఎల్‌ఎఫ్‌ఎన్ ట్రైనింగ్ కార్యక్రమంలో డీఈఓ పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలానుగుణంగా నూతన పద్ధతులు, టెక్నాలజీని ఉపయోగించాలన్నారు. విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణంలో అభ్యసనం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ రమేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



గోదా సమేత వేంకటేశ్వర స్వామి

కర్నూలు కల్చరల్: ధనుర్మాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని వైష్ణవ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. సోమవారం తెల్లవారు జాము నుంచే నగర శివారు మాసమసీదు సమీపంలోని గోదాగోకులం, సూర్యనారాయణ స్వామి ఆలయం, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయం, కృష్ణానగర్‌లోని శ్రీనివాసమందిరం, సీక్యాంప్‌లోని విజ్ఞాన మందిరం, దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం, రంగరాజు వీధిలోని మాలెబాలె సత్రం, సంకల్‌బాగ్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, వెంకటరమణ కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఓల్డ్‌సిటీలోని లలితా పీఠం, దండెగేరిలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రాతఃకాల పూజలు జరిగాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో తిరుప్పావైలోని మొదటి పాశురాన్ని పఠించారు. పూజల్లో ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



సూర్యనారాయణ స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



గోదాగోకులంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



గౌరీ శంకర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

కరాటేలో బంగారు పతకం



పతకంతో క్రీడాకారుడు వెంకట శ్రీ దినేష్

కర్నూలు (టౌన్): ఈ నెల 9వ తేదీన ఢిల్లీలో ప్రారంభమైన జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన మన్నెపు వెంకట శ్రీ దినేష్ బంగారు పతకం సాధించాడు. అండర్-17 విభాగంలో పాల్గొని సత్తా చాటాడు. మొట్టమొదటి సారిగా జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన క్రీడాకారుడికి అభినందనలు వెల్లువెత్తాయి. ఆయన తండ్రి వాసు సీసీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బంగారు పతకం సాధించిన క్రీడాకారుడికి ఘన స్వాగతం పలుకుతూ నగరంలో ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు క్రీడా సంఘాలు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహకులు, క్రీడాకారుడికి శిక్షణ ఇచ్చిన జేకే అకాడమీ నిర్వహకులు వెల్లడించారు.

విద్యుత్ పొదుపుతోనే భవిష్యత్తు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్‌ను ఎంత పొదుపుగా వాడుకుంటే భవిష్యత్తు తరాలకు అంత వెలుగు అందించవచ్చని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఉమాపతి తెలిపారు. విద్యుత్ పొదుపు వారోత్సవాలను ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఎస్ఈ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ నుంచి కొత్తబస్టాండ్, రాజ్‌విహార్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా ఇంధన పొదుపు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. పెరిగిన శాస్త్ర సాంకేతికత వల్ల నిత్య జీవితంలో విద్యుత్ అత్యంత విలువైన వినియోగ వస్తువుగా మారిందని తెలిపారు. అలాంటి విద్యుత్ వాడకంపై సరైన అవగాహన లేకపోతే ప్రతిఒక్కరూ పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ విద్యుత్ పొదుపునకు సహకరించాలని కోరారు. విద్యుత్ వృథాతో బిల్లు భారంతో పాటు అంతరాయాల వల్ల కలిగే ఇబ్బందులతో జన జీవనం సతమతమవుతుందని తెలిపారు. విద్యుత్ పొదుపు వారోత్సవాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈఈ శేషాద్రి, ఏడీఈలు, డీఈలు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ పొదుపు ర్యాలీలో పాల్గొన్న ఎస్ఈ ఉమాపతి, ఈఈ శేషాద్రి, విద్యుత్ అధికారులు

పీజీఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

- కళావతి నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు
- డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నాం
- కమిషనర్‌కు పలువురి వినతి

కర్నూలు (టౌన్): సార్.. చాలా సార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించాం. కానీ పట్టించుకోవడం లేదు. వెంకటరమణ కాలనీలో జనావాసాల మధ్యనే పశువులను పెంచుతున్నారు. పరిసర ప్రాంతాలను అపరిశుభ్రం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని స్థానికంగా నివసించే జి.లక్ష్మీపతియాదవ్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. నగర పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు కమిషనర్ రవీంద్రబాబుకు తమ సమస్యలు వివరించారు. ప్రజా సమస్యలను నిర్దేశిత సమయంలో పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న నగరవాసులు

ఫిర్యాదుల్లో కొన్ని..

- రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని, పందుల సమస్య పరిష్కరించాలని చింతలముని నగర్‌కు చెందిన ప్రభావతి, వీరేంద్ర వినతిపత్రం అందజేశారు.
- ఈ నెల 30వ తేదీ ఏపీఎస్‌పీ క్యాంపులో సివిల్ కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్ జరుగుతుందని, ప్రత్యేక పారిశుద్ధ్యం, మొబైల్ టాయ్‌లెట్స్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఏపీఎస్‌పీ సూపరింటెండెంట్ మాధవ్ కోరారు.
- కళావతి నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు నారాయణ ఫిర్యాదు చేశారు.
- డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని రాధానగర్, రేణుకా నగర్‌కు చెందిన కాలనీవాసులు ప్రవీణ్, ఉపేంద్ర అభ్యర్థించారు.
- వెంకటరమణ కాలనీ, వీనస్ కాలనీలో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు బి.క్రిష్ణమోహన్, శివయ్య ఫిర్యాదు చేశారు.
- టిడ్కో ఇంటి కోసం తాము చెల్లించిన నగదు తిరిగి ఇప్పించాలని దరఖాస్తుదారులు సునీత, అనురాధ వినతిపత్రం అందజేశారు.
- కె.సి.కెనాల్ వద్ద విస్తరణ పనుల్లో నివాసాలు కోల్పోయిన తమకు తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేయాలని షికారీలు విన్నవించారు.

కోల్స్ చర్చిలో ఘనంగా క్యాండిల్ లైటింగ్





దైవసందేశం ఇస్తున్న రెవరెండ్ గ్లాడ్సన్ రామపోగు, క్రిస్మస్ గీతాలు ఆలపిస్తున్న క్వయర్ బృందం సభ్యులు

కర్నూలు (టౌన్): స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో మంగళవారం రాత్రి ముందస్తు క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చర్చి క్వయర్ డైరెక్టర్ రవీంద్రనాథ్, ఫ్రాంక్లిన్ సుకుమార్, సుధీర్‌కుమార్, రవికాంత్ ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తి గీతాలు ఆలపించారు. క్వయర్ బృందం ఆధ్వర్యంలో క్యాండిల్స్ వెలిగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య ప్రసంగీకులు నెల్లూరుకు చెందిన ఎక్లీషియా బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ గ్లాడ్సన్ రామపోగు సందేశమిస్తూ.. క్రీస్తు ఈ లోకాన్ని పాపమనే చీకటి నుంచి రక్షించి వెలుగులోకి నడిపించేందుకు వచ్చాడని గుర్తు చేశారు. కోల్స్ చర్చి అధ్యక్ష, కార్యదర్శులు ఏడీఏ లింకన్, జాన్ విల్సన్, పాస్టర్లు రెవరెండ్ అనిల్‌కుమార్, శామ్యూల్, రెవరెండ్ ఎస్‌జే జీవన్‌రావు, పాస్కల్ ప్రకాష్, క్రిస్మస్ కమిటీ సభ్యులు భాస్కర్ రావు, ప్రసన్న, రూఫస్ రొనాల్డ్, డేవిడ్ సునీల్, వినయ్‌కుమార్, అకర్మన్ విన్సీ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతికి సంతాపం

కర్నూలు(సెంట్రల్): అకాల మరణం పొందిన డోన్‌కు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు దిగురె కాశీంకు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని, ఆయన విద్యార్థి దశ నుంచి పార్టీలో చురుగ్గా పనిచేశారని గుర్తుచేశారు. ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసిన కాశీం అకాల మరణం పొందడం బాధాకరమని పేర్కొన్నారు.

పెద్దాసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రి క్యాజువాలిటీ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, రాఘవేంద్ర మాట్లాడుతూ.. ఆసుపత్రిలో మందులు, పరీక్షలు బయటకు రాస్తున్నారని విమర్శించారు. ఎక్స్‌రే, ఈసీజీ మిషన్ల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల రోగులు ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తోందని, వాటి సంఖ్యను పెంచాలని కోరారు. ఆసుపత్రిలో డాక్టర్లు, స్టాఫ్‌నర్సుల కొరత తీర్చాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఐద్వా జిల్లా నాయకులు శ్యామలమ్మ, మాలన్, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుసేన్‌బాషా, ఐద్వా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

పడకేసిన పారిశుద్ధ్యం

కరూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. జి.శింగావరం ఎస్సీ కాలనీలో మురుగునీరు ఇళ్ల ముందే నిలవడంతో దుర్గంధం వెదజలుతోంది. దీంతో ఆ కాలనీ మీదుగా వెళ్లాలంటే ముక్కమూసుకోవాల్సిన పరిస్థితి. మురుగునీటి వల్ల దోమలు, విషకీటకాల బారినపడి ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారు. సమస్యను విన్నవించినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని కోరుతున్నారు.



ఇళ్ల ముందు నిలిచిన మురుగునీరు



కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం(రూ.)	గరిష్టం(రూ.)
వేరుశనగ	4,069	6,799
పొద్దుతిరుగుడు	2,870	5,969
ఆముదం	5,050	5,607
వాము	12,069	12,069
ఉల్లి	615	3,149
ఎండుమిర్చి	2,345	15,499
శనగలు	6,329	6,329
కందులు	2,000	8,691
మొక్కజొన్న	2,109	2,309
మినుములు	8,287	8,287
కొర్రలు	1,607	2,531
సోయాచిక్కుడు	3,809	3,809
సజ్జలు	2,291	2,291

ఫోన్ నం : 08518-257204, 257661

8వ రోజుకు చేరిన కార్మికుల సమ్మె



నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

కర్నూలు (టౌన్): చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా? అని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు విమర్శించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ నగరపాలక సంస్థ ఎదుట చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలు 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు తమకు వర్తింపజేయాలన్నారు. అసోసియేషన్ నాయకులు జ్ఞానమ్మ, షేక్షావలి, కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

కర్నూలు(రూరల్): నగరంలోని మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో మంగళ, బుధవారాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గ్రామ సర్పంచ్‌లకు, మండల స్థాయి అధికారులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి (రెండవబ్యాచ్) కార్యక్రమము నిర్వహిస్తూనట్లు కర్నూలు ఎంపీడీఓ రఘునాథ్ సోమవారం తెలిపారు. శిక్షణకు అందరూ హాజరు కావాలన్నారు.

సి.బెళగల్ మండలంలో..

సి.బెళగల్: మండల అధికారులకు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, కొన్ని శాఖల సచివాయల ఉద్యోగులకు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. సోమవారం ఆమె ఓ ప్రకటనలో తెలియజేస్తూ స్థానికీకరణ, సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే శిక్షణ కార్యక్రమానికి అధికార యంత్రాంగం తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

ఉపాధ్యాయులకు జ్ఞాపికలు



ఉపాధ్యాయులతో విజ్ఞాన పీఠం నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: నగరంలోని వివిధ పాఠశాలల్లో భగవద్గీత శ్లోకాలను నేర్పించిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలను బహుకరించారు. సోమవారం నగర శివారులోని విజ్ఞాన పీఠంలో గీతా జయంతి నిర్వహణపై జరిగిన సమీక్షలో విజ్ఞాన పీఠం కార్యదర్శి పి.పి.గురుమూర్తి ఉపాధ్యాయులకు జ్ఞాపికలను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీతా జయంతి రోజున నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో సుమారు 900 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఉపాధ్యాయులు నెల రోజుల పాటు శ్లోకాలను నేర్పించి ప్రోత్సహించడంతోనే పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ప్రధానోపాధ్యాయులు మాళిగి వ్యాసరాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి పాండురంగారెడ్డి

కర్నూలు (లీగల్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం కర్నూలు, నంద్యాల జిల్లాల న్యాయవాదులకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయ భవనంలో శిక్షణను జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు పాండురంగారెడ్డి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం హైకోర్టు అన్ని జిల్లా కోర్టుల్లో మధ్యవర్తిత్వం ప్రవేశపెట్టాలని తీర్మానించిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు మధ్యవర్తిత్వంను ఏ విధంగా చేయాలని న్యాయవాదులకు అవగాహన కల్పించనున్నారు. చెన్నై, బెంగుళూరు నుంచి మధ్యవర్తిత్వం శిక్షణ సిబ్బంది ఎస్.అరుణాచలం, ఎస్.ఎన్.సుధ వచ్చారని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ.. వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 89 కింద పరిగణించేదే మధ్యవర్తిత్వం అని తెలిపారు. దీని వల్ల కోర్టులో కేసులు విచారణ వరకు వెళ్లకుండా పరిష్కరించుకోవచ్చన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల న్యాయవాదులు పాల్గొన్నారు.

జీసీటీఏ రాష్ట్ర కార్యవర్గంలో చోటు



కె.బాలసుబ్రమణ్యం రాయలసీమ జోన్ అధ్యక్షుడు



జి.ఎల్లాకృష్ణ రాష్ట్ర కోశాధికారి

కర్నూలు సిటీ: ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకులకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ కాలేజీల టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) 37వ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం విజయవాడలోని ఎస్ఆర్ఆర్, సీవీఆర్ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాయలసీమ జోన్ అధ్యక్షుడిగా డాక్టర్ కె.బాలసుబ్రమణ్యం (ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు), డాక్టర్ జి.ఎల్లాకృష్ణ (సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ, అర్థశాస్త్ర అధ్యాపకులు) రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతుగా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీలో జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చినందుకు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డాలు నాగన్న (కామర్స్ లెక్చరర్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ), కార్యదర్శి డాక్టర్ దళవాయి శ్రీనివాసులు(కామర్స్ లెక్చరర్, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ), ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

యువ రచయితకు సన్మానం

కర్నూలు కల్చరల్: మండల పరిధిలోని దిన్నెదేవరపాడుకు చెందిన యువ రచయిత మీసాల రఘును ఘనంగా సన్మానించారు. మంత్రాలయంలోని పరిమళ పాఠశాల ఆవరణలో జరిగిన జాతీయ శతక కవి సమ్మేళనంలో రఘు పాల్గొని తన కవితను వినిపించి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కర్నూలు జిల్లా గౌరవాధ్యక్షుడు నారాయణ రెడ్డి తదితరులు రఘును సన్మానించారు.



రచయిత రఘును సన్మానిస్తున్న అతిథులు